# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-06-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి కుటుంబానికి 2 లక్షలకు పైగా ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **రాజధాని ప్రాంతంలో వాగుల నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపిన మంత్రి పి. నారాయణ.**

3. **'మిషన్ పాత్‌హోల్ ఫ్రీ' కార్యక్రమం ద్వారా 20 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల మరమ్మతులు చేపట్టామన్న మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి.**

4. **"ఫుడ్ ప్లానెట్ ప్రైజ్-2026" పురస్కారానికి ఎంపికైన రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విధానం.**

============================

రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి కుటుంబానికి 2 లక్షల రూపాయలకు పైగా ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గుంటూరులో నిర్వహించిన ఒక ప్రయివేట్ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈరోజు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ప్రజలకు సమగ్ర ఆరోగ్య సేవలు అందించేందుకు 'సంజీవని' పేరుతో ప్రత్యేక ఆరోగ్య కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ హెల్త్ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తూ, ముందస్తు అంచనా, నివారణ, చికిత్స విధానాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ఆరోగ్యవంతమైన సమాజం ద్వారా దేశ ఆరోగ్యాభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 5వ తేదీ నుంచి 21వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించనున్నామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నిన్న ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలోపేతమైందని, పేదరిక నిర్మూలన, ఉచిత బియ్యం పంపిణీ, ఆయుష్మాన్ భారత్ వంటి పథకాల ద్వారా కోట్లాది మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. అంతర్జాతీయ యోగా

దినోత్సవం సందర్భంగా ఈనెల 21న ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

---------------------------

రాజధాని అమరావతి ప్రాంతంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ ఈ రోజు పర్యటించారు. ఈ సందర్భంగా కొండవీటివాగు, పాలవాగు ప్రవాహ మార్గాలను పెనుమాక జలాశయాన్ని అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాజధాని ప్రాంతంలో వాగుల నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు, మట్టి పూడికతీతలు తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 5వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా 'అమ్మ పేరున ఒక మొక్క' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దాని సంరక్షణ బాధ్యతను చేపట్టాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు ప్రజల భాగస్వామ్యంతో విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలని పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పీవీఎన్ మాధవ్ కోరారు.

---------------------------

గుంతల రహిత రహదారుల లక్ష్యంతో 861 కోట్ల రూపాయలతో చేపట్టిన 'మిషన్ పాత్‌హోల్ ఫ్రీ' కార్యక్రమం ద్వారా గత రెండేళ్లలో 20 వేల కిలోమీటర్లకు పైగా రహదారుల మరమ్మతులు చేపట్టామని రహదారులు భవనాల శాఖ మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో రహదారులు భవనాల శాఖలో రెండేళ్లలో సాధించిన పురోగతిపై మంత్రి ఈ రోజు పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారుల అభివృద్ధి కోసం 2 వేల 5 వందల కోట్ల రూపాయాలతో 6 వేల కిలోమీటర్లకు పైగా పనులు చేపట్టామన్నారు. వీటిలో ప్లాస్టిక్ రోడ్లు, నానో కాంక్రీట్ సాంకేతికత వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానానికి అంతర్జాతీయ స్థాయిలో మరో కీలక గుర్తింపు లభించిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రతిష్ఠాత్మక " ఫుడ్ ప్లానెట్ ప్రైజ్––2026" పురస్కారానికి ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం - **APCNF** ఎంపికైందని ఈ రోజు ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రపంచ స్థాయి గుర్తింపు రావడం రాష్ట్ర రైతాంగం, గ్రామీణ మహిళల కృషికి దక్కిన గౌరవమని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నమూనా దేశంలోని 21 రాష్ట్రాలతో పాటు విదేశాల్లోనూ అమలవుతోందని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రపంచ సైకిల్ దినోత్సవం ఈ రోజు నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూన్ 3వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. పోలాండ్ దేశానికి చెందిన లెస్ జెక్ సిబిల్ స్కి అనే సామాజికవేత్త కృషి ఫలితంగా సైకిల్ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రపంచ సైకిల్ దినోత్సవం నిర్వహించాలని కోరుతూ సైకిల్ పై పర్యటిస్తూ ఆయన 57 దేశాల మద్దతు సాధించారు. లెస్ జెక్ సిబిల్ స్కి కృషి ఫలితంగా 2018వ సంవత్సరంలో జరిగిన ఐక్య రాజ్య సమితి సర్వ సభ్య సమావేశంలో జూన్ 3ను ప్రపంచ సైకిల్ దినోత్సవంగా ప్రకటించింది.

---------------------------

ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని మేరా యువ భారత్ సంస్థ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అవగాహన సైకిల్ ర్యాలీలను నిర్వహించింది. విజయనగరంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీని జిల్లా యువజనాధికారి ప్రేమ్ భరత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైక్లింగ్ ఆరోగ్యానికి మేలు చేయడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అన్నారు. అనంతపురంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీలో మేరా యువ భారత్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొని మాట్లాడుతూ, ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల మంచి ఆరోగ్యం లభిస్తుందని, యువత ఇంధన పొదుపుతో పాటు ఆరోగ్య పరిరక్షణకు సైక్లింగ్‌ను అలవాటు చేసుకోవాలని సూచిస్తూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

ఈనెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 7వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. యోగా కార్యక్రమాల నిర్వహణపై జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన నిన్న మాట్లాడుతూ, జిల్లాలో ఈ నెల 15న సూర్యలంక నగరవనం వద్ద, 16న భట్టిప్రోలు బౌద్ధ స్తూపం వద్ద ప్రత్యేక పర్యాటక యోగా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 21న జిల్లా స్థాయిలో నిర్వహించే ప్రధాన యోగా కార్యక్రమంలో వెయ్యి మందికిపైగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

---------------------------

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ప్రకాశం జిల్లా కలెక్టర్, ఒంగోలు నగర పాలక సంస్థ ప్రత్యేక అధికారి పి. రాజాబాబు అన్నారు. “ఆపరేషన్ క్లీన్ స్వీప్” కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరంలో కాలువల శుభ్రత కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పోతురాజు కాలువ శుభ్రపరిచే పనులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, నగర పరిశుభ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నాలుగు వారాల పాటు నిర్వహించే ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

=====================